సాక్షి నల్లగొండ

శనివారం । 12 । జూలై । 2025



5 లక్షల కార్డులు..

నూతనంగా 5 లక్షల రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. - 8లో



నాణ్యతా ప్రమాణాలు పెరగాలి

డిగ్రీ విద్యలో నాణ్యతా ప్రమాణాలు పెరగాలని ఎంజీ యూనివర్సిటీ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ పేర్కొన్నారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు		
ప్రస్తుత నీటి మట్టం	:	545.30 అడుగులు
ఇన్‌ఫ్లో	:	1,24,800 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	5,244 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా : 4,144		
కుడికాల్వ ద్వారా	:	నిల్
ఎడమకాల్వ ద్వారా	:	నిల్
ఏఎమ్మార్పీకి	:	1,100 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	నిల్

న్యూస్‌రీల్

నేడు నల్లగొండకు మంత్రుల రాక

నల్లగొండ : నల్లగొండకు శనివారం రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్, బీసీ వెల్ఫేర్ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రానున్నారు. శనివారం ఉదయం 10 గంటలకు వారు నల్లగొండకు చేరుకుని వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు హాజరవుతారు. అనంతరం కలెక్టరేట్‌లో జరిగే సమీక్ష సమావేశంలో పాల్గొంటారు.

ఎంజీయూలో వనమహోత్సవం

నల్లగొండ టూటౌన్ : మొక్కల పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని ఎంజీ యూనివర్సిటీ అధ్యాపకుడు రామచంద్రు అన్నారు. వనమహోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఎంజీ యూనివర్సిటీలో అధ్యాపకులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణతో పాటు కాలుష్య నివారణకు కృషి చేసిన వారవుతామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సీహెచ్ రమేష్, భిక్షమయ్య, శేఖర్, స్వామి పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులాల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు

నల్లగొండ : జిల్లా మైనారిటీ గురుకులాల్లో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన టీచర్లుగా పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి టి.విజయేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ బాలుర కాలేజీలో జెఎల్ ఫిజిక్స్ జనరల్ 1, మిర్యాలగూడ బాలికల కాలేజీలో జేఎల్ ఇంగ్లిష్ మహిళ 1, పీజీటీ పిజికల్ సైన్స్ మహిళ 1, దేవరకొండ బాలుర పాఠశాలలో టీజీటీ మ్యాథ్స్ జనరల్ 1 పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను నల్లగొండలోని కార్యాలయంలో ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా అందజేయాలని పేర్కొన్నారు.

పీఆర్‌సీ అమలు చేయాలి



సభ్యత్వం అందజేస్తున్న వెంకటేశం

పెద్దవూర : ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పీఆర్‌సీని తక్షణమే అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ సభ్యత్వ నమోదులో భాగంగా శుక్రవారం పెద్దవూర మండలంలోని వెల్మగూడెం, చలకుర్తి, పెద్దవూర, పులిచర్ల తదితర పాఠశాలలను ఆయన సందర్శించి మాట్లాడారు. మూడేళ్లుగా పెండింగ్ బిల్లుల జాప్యంతో ఉపాధ్యాయులు నిరాశకు లోనవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు రమావత్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి గోలి కృష్ణ, నాయకులు రామకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, హరేందర్‌రెడ్డి, ఉపేందర్, సహదేవి, వెంకన్న, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా అకాడమీలో ప్రవేశాలు

నల్లగొండ టూటౌన్ : రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, ఎల్‌బీ స్టేడియంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రీడా అకాడమీలో 2025–2026 విద్యా సంవత్సరానికి బాలబాలికలకు ప్రవేశాలు కల్పించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి ఎండీ.అక్బర్ అలీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గచ్చిబౌలి క్రీడా అకాడమీలో హాకీ, అథ్లెటిక్ క్రీడాకారులకు ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఎల్‌బీ స్టేడియంలో అకాడమీలో హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్ క్రీడాకారులకు ప్రవేశాలు ఉంటాయని పేర్కొన్నారు. 12 నుంచి 16 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలబాలికలు వయస్సు, విద్యార్హత సర్టిఫికెట్లు క్రీడా ధ్రువపత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్‌ఫొటోలు, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 15న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియానికి వెళ్లాలని పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై హర్షం



నకిరేకల్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడాన్ని హర్షిస్తూ నకిరేకల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఫ్లెక్సీ పాలాభిషేకం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

మాకొద్దు.. జీపీఓ!

'గ్రామపాలన'కు పూర్వ వీఆర్‌ఓ, వీఆర్‌ఏల అనాసక్తి

- జిల్లాలో 566 రెవెన్యూ గ్రామాలకు జీపీఓలు అవసరం
- గతంలో దరఖాస్తు చేసుకుంది 241 మంది
- పరీక్షలో 184 మంది ఉత్తీర్ణత
- మళ్లీ దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ప్రభుత్వం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : గ్రామపాలన అధికారి (జీపీఓ)గా పని చేసేందుకు పూర్వ వీఆర్‌ఓ, వీఆర్‌ఏలు వెనుకంజ వేస్తున్నారు. జిల్లాలో 566 రెవెన్యూ గ్రామాలున్నాయి. ప్రతి గ్రామానికి ఒక గ్రామ పాలన అధికారిని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందుకోసం గతంలో రెవెన్యూ శాఖలో పనిచేసిన వీఆర్‌ఓ, వీఆర్‌ఏల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. తిరిగి రెవెన్యూ శాఖకు వచ్చి గ్రామాల్లో పని చేసేందుకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని కోరింది. అందుకు జిల్లాలో 241 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఉన్న పోస్టుల మేరకు కూడా దరఖాస్తులు రాలేదు. దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం రెండు నెలల కిందట పరీక్ష నిర్వహించగా, అందులో 184 మంది ఉత్తీర్ణులయ్యారు. 57 మంది ఫెయిల్ అయ్యారు. దీంతో ప్రభుత్వం మళ్లీ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

ధరణి వచ్చాక వీఆర్‌ఓ, వీఆర్‌ఏ పోస్టులు రద్దు..

గత ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకువచ్చి, వీఆర్‌ఓ, వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేసింది. గ్రామాల్లో పనిచేస్తున్న ఆ ఉద్యోగులను ఇతర శాఖల్లో సర్దుబాటు చేసింది. దీంతో అప్పటి వరకు గ్రామాల్లో పని చేసిన వీఆర్‌ఓ, వీఆర్‌ఏలు ఇతర శాఖలకు వెళ్లిపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. గత ప్రభుత్వం తెచ్చిన ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని తీసుకొచ్చింది. అలాగే వీఆర్‌ఓల స్థానంలో జీపీఓలను నియమించాలని నిర్ణయించింది.

16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి

గ్రామపాలన అధికారి పోస్టులను గతంలో వీఆర్‌ఓ, వీఆర్‌ఏలు పని చేసిన వారితో భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో ఇతర శాఖలకు వెళ్లిపోయిన వారిలో తిరిగి రెవెన్యూ శాఖకు రావాలనుకునేవారు దరఖాస్తు చేసుకోవాలని కోరినా.. మొదటి విడతలో చాలా మంది ఆసక్తి చూపలేదు. దీంతో రెండోసారి దరఖాస్తుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. రెవెన్యూ శాఖలో పనిచేసిన పూర్వ వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలతో పాటు గతంలో ఫెయిలైన వారు కూడా గ్రామ పాలన అధికారులుగా వచ్చేందుకు ఈ నెల 16వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి దరఖాస్తులు ఆహ్వానించారు. గూగుల్ ఫారంలో forms.gle/rBDToMSakRcPoivWA ద్వారా దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. వచ్చే దరఖాస్తులను బట్టి మళ్లీ పరీక్ష నిర్వహిస్తారా? ఎలా నియామకం చేస్తారన్న దానిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది.

ఒత్తిడి కారణంగానే..

రెవెన్యూ శాఖలో నిత్యం ఒత్తిడి మధ్యలోనే పనిచేయాల్సి ఉంటుంది. గ్రామాలకు ఏ ఉన్నతాధికారి వచ్చినా, ప్రజాప్రతినిధుల వచ్చినా, ఎలాంటి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించినా ముందుండి ఏర్పాట్లు చేయించాల్సింది గ్రామపాలన అధికారులే. ఒక పక్క రెవెన్యూ సమస్యలతోపాటు మరోపక్క ఈ పనులన్నీ చేయాల్సి ఉండటంతో గతంలో పనిచేసిన వారెవరూ ముందుకు రావడం లేదు. ఇదిలా ఉంటే పదోన్నతిపై జూనియర్ అసిస్టెంట్లుగా ఇతర శాఖల్లో సర్దుబాటు అయిన వీఆర్‌ఓ, అర్హత కలిగిన వీఆర్‌ఏలు తమకు పరీక్ష నిర్వహించవద్దని కోరారు. తాము గతంలో రెవెన్యూ శాఖలో పని చేశామని.. నేరుగా తీసుకోవాలని పేర్కొన్నారు. పరీక్ష విధానం కారణంగా చాలా మంది తిరిగి వెనక్కి వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. మరోవైపు మున్సిపాలిటీ, వైద్య ఆరోగ్య శాఖ, ఇతర శాఖల్లోకి వెళ్లిన ఆయా ఉద్యోగులు అక్కడ ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో తిరిగి గ్రామ పాలన అధికారులుగా వచ్చేందుకు వారు ఆసక్తి చూపడం లేదు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం రెండోసారి నోటిఫికేషన్ జారీ చేసింది. ఈసారి ఎంత మంది దరఖాస్తు చేసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

49,950 మందికి రేషన్ కార్డులు

కొత్తగా మంజూరు చేసిన ప్రభుత్వం

- 14న సీఎం చేతుల మీదుగా పంపిణీకి సన్నాహాలు
- ఏర్పాట్లలో నిమగ్నమైన యంత్రాంగం
- పదేళ్ల నిరీక్షణకు తెర



నల్లగొండ : రేషన్‌కార్డుల కోసం పేదలు, మధ్యతరగతి ప్రజల నిరీక్షణకు తెరపడనుంది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రతి కుటుంబానికి ఆహార భద్రత కల్పించేందుకు ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేస్తోంది. పదేళ్లుగా కార్డుల జారీ ప్రక్రియ నిలిచిపోయింది. కేవలం మునుగోడు ఉప ఎన్నిక సమయంలో అక్కడి ప్రజలకు మాత్రమే కొన్ని కార్డులు మంజూరు చేశారు. నాటి నుంచి ఇప్పటి వరకు ఒక్కకార్డు కూడా ఇవ్వకపోవడంతో వేలాది మంది పేదలు రేషన్ కార్డుల కోసం నిరీక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియను వేగవంతం చేసింది. ఈనెల 14వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించనున్నారు.

33 మండలాల్లో..

జిల్లాలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిశీలించిన అధికారులు అన్ని అర్హతలు ఉన్న వాటిని ఆమోదించారు. జిల్లాలోని 33 మండలాల పరిధిలో 2 లక్షల వరకు దరఖాస్తులు రాగా అందులో 49,950 మందికి కొత్త కార్డులను మంజూరు చేశారు. మరో 75 వేల మంది కార్డుల్లో కొత్తగా పిల్లల పేర్లను నమోదు చేశారు. అయితే జిల్లాలో కొత్త రేషన్‌కార్డుల పంపిణీకి సంబంధించి అధికారులు ఇప్పటికే జాబితా సిద్ధం చేశారు.

పంపిణీకి ఏర్పాట్లు చేశాం

జిల్లాలో 33 మండలాల పరిధిలో ఇప్పటికే 49,950 మందికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశాం. అలాగే 75వేల కార్డుల్లో కొత్తగా కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేశాం. కార్డుల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశాం.

– వెంకటేశ్వర్లు, డీఎస్‌ఓ

సాగర్ రహదారిపై మూలమలుపుల పరిశీలన



మూలమలుపులను పరిశీలిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్, పోలీస్ సిబ్బంది

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్ నేషనల్ హైవేపై బ్లాక్‌స్పాట్లను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ శుక్రవారం పరిశీలించారు. ఇటీవల ఈ మార్గంలో తరచూ జరిగే రోడ్డు ప్రమాదాలు పోలీస్‌శాఖను ఆందోళనకు గురిచేశాయి. ఈ నేపథ్యంలో 'సాక్షి'లో వరుస కథనాలు వెలువడ్డాయి. దీంతో స్పందించిన ఎస్పీ శుక్రవారం ఆ ప్రాంతాలను సందర్శించి ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ వార్నింగ్ బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, స్ట్రీట్ లైట్ల ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. అవసరమైన చోట రోడ్డు వెడల్పు అంశాన్ని చర్చించారు. ఎస్పీ వెంట సీఐ అంజయ్య, నేషనల్ హైవే డీఈ మురళీకృష్ణ, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ ఎస్‌ఈ వి.గీత, ఏఈ కె.శేఖర్, ఫారెస్ట్ అధికారి రావేందర్‌రావు, ఎంవీఐ సతీష్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కల్పన, సాగర్ సీఐ శ్రీనునాయక్ ఎస్‌ఐ ముత్తయ్య ఉన్నారు.

ఫొటో తీసి.. పౌష్టికాహారం ఇచ్చి

- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫేస్ రికగ్నేషన్ విధానం
- పౌష్టికాహారం పంపిణీలో పారదర్శకతే లక్ష్యంగా అమలు



మిర్యాలగూడలో ఫేస్ రికగ్నేషన్ కోసం చిన్నారి ఫొటో తీస్తున్న అంగన్‌వాడీ టీచర్

మిర్యాలగూడ టౌన్ : అంగన్‌వాడీ కేంద్రాల సేవల్లో పారదర్శకత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం సాంకేతికతను వినియోగిస్తోంది. లబ్ధిదారులకు సరుకులను ఇచ్చేందుకు ఫేస్ రికగ్నేషన్ సిస్టం(ఎఫ్‌ఆర్‌ఎస్) అమలు చేస్తోంది. ఇప్పటి వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం, ఇతర సేవలన్నింటినీ రికార్డుల్లో నమోదు చేసేవారు. గుడ్లు, బాలామృతం, ఇతర పోషకాహార పదార్థాలు సరిగా అందడం లేదని, తమ సంతకాలను ఫోర్జరీ చేస్తున్నారని లబ్ధిదారుల నుంచి ఆరోపణలున్నాయి. దీంతో సేవల్లో పాదర్శకత ఉండేలా ఫేస్ రికగ్నేషన్ విధానం తప్పనిసరి చేసింది. కేంద్ర మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో జూలై 1వ తేదీ నుంచి ఈ విధానం అమలు చేస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్లకు గతంలో అందించిన 'పోషణ ట్రాక్టర్' యాప్ ద్వారా ఫేస్ రికగ్నైషన్ హాజరు తీసుకుంటున్నారు.

జిల్లాలోని కేంద్రాలు, లబ్ధిదారుల వివరాలు	
ఐసీడీఎస్ ప్రాజెక్టులు	9
అంగన్‌వాడీ కేంద్రాలు	2093
చిన్నారులు	76494
గర్భిణులు	8538
బాలింతలు	6595

మొదటగా మూడేళ్లలోపు చిన్నారులు..

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఫేస్ రికగ్నేషన్ విధానం మొదటగా అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులకు అమలు చేయనున్నారు. 'పోషణ ట్రాక్టర్' యాప్‌లో చిన్నారి లేదా.. తల్లిని ఫొటోను తీసి అప్‌లోడ్ చేయనున్నారు. మొదటగా ఆధార్ వివరాలను సమర్పిస్తారు. ఫొటోను యాప్‌లో నమోదు చేసిన తర్వాత ఆధార్‌కు అనుసంధానం అయిన ఫోన్ నంబర్‌కు వన్ టైం పాస్‌వర్డ్ వస్తుంది. దీన్ని యాప్‌లో నమోదు చేయడం ద్వారా ధ్రువీకరణ పూర్తి అవుతుంది. దీంతో ఆయా లబ్ధిదారులకు పౌష్టికాహారం అందిస్తారు. లబ్ధిదారుల ఆధార్, ఇతర వివరాలను మొదటి నెలలో నమోదు చేస్తారు. ఆ తరువాత ప్రతి నెలా పౌష్టికాహారం అందించే సమయంలో ఫొటోలు తీసుకుంటారు. కొద్ది రోజుల తర్వాత మూడేళ్లు దాటిన చిన్నారులకు ఇంటికి ఇచ్చే పోషకాహారాన్ని తల్లి ఫొటోను యాప్‌లో నమోదు చేసి పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

పకడ్బందీగా అమలు చేస్తాం



అంగన్‌వాడీల్లో జూలై 1వ తేదీ నుంచి ఫేస్ రికగ్నేషన్ సిస్టం(ఎఫ్‌ఆర్‌ఎస్)లో నమోదు చేశాకే లబ్ధిదారులకు సరుకులు అందిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తాం. పోషణ ట్రాకర్ యాప్‌లో చిన్నారి లేదా తల్లి ఫొటోను తీసుకుని సరుకులు ఇస్తాం.

– కృష్ణవేణి, స్త్రీ శిశు సంక్షేమ శాఖాధికారి, నల్లగొండ

జనవరి నాటికి యాదాద్రి ఐదో యూనిట్ సిద్ధం

- ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్
- యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ సందర్శన



యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఇంధనశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, అధికారులు

మిర్యాలగూడ : దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో 5వ యూనిట్ పనులను 2026 జనవరి నాటికి పూర్తి చేసి విద్యుదుత్పాదన ప్రారంభించాలని రాష్ట్ర ఇంధనశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన యాదాద్రి థర్మల్ పవర ప్లాంట్‌ను జెన్‌కో సీఎండీ హరీష్‌తో కలిసి సందర్శించారు. పవర్ ప్లాంట్‌లోని ఉత్పత్తి యూనిట్, ప్లాంట్‌కు బొగ్గు సరఫరా, కూలింగ్ టవర్లు, స్విచ్‌యార్డు తదితర యూనిట్లను ఆయన పరిశీలించారు. వన మహోత్సవం సందర్భంగా ప్లాంట్ ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. అనంతరం వైటీపీఎస్ సమావేశ మందిరంలో ప్లాంట్ ఇంజనీరింగ్ అధికారులు, బీహెచ్‌ఈఎల్, జెన్‌కో అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. జనవరి నుంచి విద్యుత్‌కు ఏర్పడే డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకోని అనుకున్న సమయానికంటే ఒక నెల ముందుగానే 5వ యూనిట్ పనులను పూర్తి చేసి విద్యుత్ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేకించి పర్యావరణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, టౌన్‌షిప్ పనులు నిర్దేశించిన సమయంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తక్కువ ధరకు బొగ్గును తీసుకునే విధంగా అధికారులు మార్గాలను అన్వేషించాలని సూచించారు. జెన్‌కో సీఎండీ ఎస్.హరీష్ మాట్లాడుతూ.. వైటీపీఎస్‌కు వచ్చే రోడ్లు, అంతర్గత రహదారులను అభివృద్ధి చేయాలన్నారు. బీహెచ్‌ఈఎల్ అదనపు సిబ్బందిని నియమించి 5వ యూనిట్‌ను నిర్దేశించిన సమయం కంటే ముందే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 2047 విజన్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ బొగ్గు మెకానిజాన్ని రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్లాంట్ చీఫ్ ఇంజనీర్ రమేష్‌బాబు, బీహెచ్‌ఈఎల్ పవర్ డైరెక్టర్ జితేందర్ గుప్తా, నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, వైటీపీఎస్ కోల్ డైరెక్టర్ నాగయ్య, సివిల్ డైరెక్టర్ అజయ్, థర్మల్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, థర్మల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ వ్యయాన్ని తగ్గించాలి



విద్యుదుత్పత్తి వివరాలు వెల్లడిస్తున్న సీఈ

నాగార్జునసాగర్: భవిష్యత్‌లో విద్యుత్ ఉత్పత్తి నిర్వహణ వ్యయాన్ని తగ్గించుకునేలా ఇంజనీరింగ్ అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ అన్నారు. శుక్రవారం తెలంగాణ జెన్‌కో సీఎండీ హరీష్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డిలతో కలిసి నాగార్జునసాగర్ ప్రాజెక్టు ప్రధాన జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించారు. జల విద్యుత్ కేంద్రంలోని విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు, పవర్ హౌజ్‌ను పరిశీలించిన అనంతరం జెన్‌కో పవర్ పవర్ హౌజ్ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్షించారు. భవిష్యత్‌లో జల విద్యుత్ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పంపులను సోలార్‌పై నిర్వహించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. జలవిద్యుత్ కేంద్రం ద్వారా నిర్దేశించిన లక్ష్యం ప్రకారం విద్యుత్ ఉత్పత్తికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నిర్వహణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. జల విద్యుత్ కేంద్రం సీఈ మంగేష్‌కుమార్ నాగార్జునసాగర్ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రం వివరాలు తెలిపారు. అనంతరం విజయ్ విహార్ నుంచి సాగర్ జలాశయం అందాలను తిలకించారు. జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో మరమ్మతులు నిర్వహిస్తున్న మొదటి టర్బైన్ పనులు, అంతర్భాగంలో ఉన్న విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. అక్కడినుంచి కంట్రోల్ రూంకు చేరుకుని అక్కడ విద్యుత్ అధికారులతో విద్యుత్ ఉత్పత్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట అదనపు కలెక్టర్ శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, ఎస్ఈ రఘురాం, సాగర్ సీఐ శ్రీనునాయక్, జెన్‌కో సీఐ నాయుడు, పెద్దవూర తహసీల్దార్ శ్రీనివాసరావు, ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ ముత్తయ్య ఉన్నారు.

శివన్నగూడెం రిజర్వాయర్ పనుల అడ్డగింత



వాహనాలను నిలిపివేసి మాట్లాడుతున్న నిర్వాసితులు

మర్రిగూడ : మండలంలోని శివన్నగూడెం రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న చర్లగూడెం గ్రామస్తులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీతోపాటు ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. స్పష్టమైన హామీ ఇచ్చేంతవరకు పనులు జరగనివ్వమని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు వల్లపు కేశవులు, రాంకోటి, నర్సింహ, వెంకటేష్, మహేష్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నాగరాజు

నల్లగొండ టౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టల్ వసతిగృహ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు అన్నారు. శుక్రవారం పట్టణంలో సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన హాస్టల్ విద్యార్థులకు, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు ఇప్పటివరకు మెస్, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. విద్యార్థులకు సరిపడా పాఠ్యపుస్తకాలు, బట్టలు, దుప్పట్లు వెంటనే ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు. సమావేశంలో ఆకారపు నరేష్, జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్, కుర్ర సైదానాయక్, కోరే రమేష్, కుంచం కావ్య, స్పందన, రవీందర్, బుడిగ వెంకటేష్, మారుపాక కిరణ్, ఎంఏ సైఫ్, జగన్, జగదీష్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో సామగ్రి దగ్ధం

పాలకవీడు: షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు అంటుకున్నాయి. ఈ ఘటన పాలకవీడు మండలంలోని మహంకాళిగూడెం గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. అడావత్ చంద్రశేఖర్ రాత్రి సమయంలో నిద్రకు ఉపక్రమిస్తున్న సమయంలో ఇంట్లో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు విద్యుత్ సరఫరాను నిలిపివేసి మంటలు ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లో సామగ్రి దగ్ధమైంది. ల్యాప్‌టాప్, దుస్తులు, పరుపు కింద దాచిన రూ.50వేల నగదు కాలిపోయినట్లు బాధితుడు చంద్రశేఖర్ తెలిపాడు. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు వాపోయాడు. ప్రభుత్వం నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

బాల కార్మికులకు విముక్తి

కనగల్ : మండలంలో ఇద్దరు బాల కార్మికులకు ముస్కాన్ టీమ్ సభ్యులు విముక్తి కల్పించారు. ఏఎస్ఐ రామయ్య తెలిపిన ప్రకారం.. కనగల్ మండలంలో నల్లగొండ సబ్ డివిజన్ ముస్కాన్ టీం, చైల్డ్‌లేబర్, చైల్డ్ హెల్ప్‌లైన్, ఆశ్రిత ఎన్జీఓ సభ్యులు శుక్రవారం తనిఖీలు చేశారు. కనగల్ ఎక్స్‌రోడ్‌లోని ఒక స్వీట్‌హౌస్, టీ స్టాల్‌లో 17 సంవత్సరాల లోపు వయసున్న రాజస్థాన్‌కు చెందిన అర్జున్‌రామ్, కైలాస్ అనే ఇద్దరు బాలురు పనులు చేస్తుండగా వారిని ముస్కాన్ టీం పట్టుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. ముస్కాన్ టీమ్ ఫిర్యాదు మేరకు టీస్టాల్ యజమాని ప్రకాష్‌సింగ్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు. పట్టుబడిన బాల కార్మికులను నల్లగొండ చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగిస్తామన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

భూదాన్‌పోచంపల్లి : బాలకార్మికులను పనిపెట్టుకున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి శుక్రవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పోచంపల్లి పట్టణ కేంద్రంలోని పూజిత చికెన్‌సెంటర్‌లో బీహార్ రాష్ట్రానికి చెందిన మైనర్‌బాలుడిని, మండలంలోని జిబ్లక్‌పల్లి గ్రామ పరిధిలో గల ఎంఎన్ఎస్ఆర్ ఫౌల్ట్రీ ఫామ్‌లో అస్సాం రాష్ట్రానికి చెందిన మైనర్ బాలుడిని పనిలో పెట్టుకున్నట్లు గుర్తించారు. వారితో పనిచేస్తున్న ఇద్దరు యజమానులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

చింతపల్లి : జూదం ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసిన సంఘటన చింతపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ ముత్యాల రాంమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వింజమూరు గ్రామ శివారులో జూదం ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి రైడ్ చేయగా ఐదుగురు వ్యక్తులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి నాలుగు ద్విచక్రవాహనాలు, నాలుగు సెల్ ఫోన్లు, రూ.12,200 నగదు స్వాధీనం చేసుకొని వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

5 లక్షల రేషన్ కార్డులు అందజేస్తాం

- పౌర సరఫరాలు, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి తిరుమలగిరిలో సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన



తిరుమలగిరిలో మాట్లాడుతున్న పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి లక్ష్మణ్‌కుమార్, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేల్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

తిరుమలగిరి (తుంగతుర్తి) : నూతనంగా 5 లక్షల రేషన్ కార్డులు అందజేయనున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 14న ముఖ్యమంత్రి చేతుల మీదుగా సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో నూతన రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభిస్తామని చెప్పారు. శుక్రవారం తిరుమలగిరిలో సీఎం సభ ఏర్పాట్లను ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్‌కుమార్, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో గతంలో 2.80 కోట్ల మందికి రేషన్ అందేదని, ప్రస్తుతం 3.10 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నట్లు చెప్పారు. భారత దేశంలోనే 281 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి చేసి ప్రథమ స్థానం పొందామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ చేయని విధంగా 1.04 లక్షల మంది ఎన్యుమరేటర్ల ద్వారా బీసీ కుల గణన చేశామని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని మంత్రి ఉత్తమ్ చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ వర్గీకరణ చేశామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 95 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు ఇచ్చినట్లు తెలిపారు. తిరుమలగిరిలో ఈ నెల 14న సీఎం చేతుల మీదుగా కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు, అదేరోజు జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యం : మంత్రి అడ్లూరి

ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. జూలై 14న జరిగే నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, జిల్లా ఎస్పీ కె.నరసింహా, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్, ఆర్థిక సంఘం కమిషన్ సభ్యుడు సుధీర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్డీఓ వీవీ.అప్పారావు, డీఎస్ఓ సతీష్‌కుమార్, ఆర్డీఓ వేణుమాధవరావు, తహసీల్దార్ హరిప్రసాద్, కాంగ్రెస్ నాయకులు సర్వోత్తమ్‌రెడ్డి, వేణారెడ్డి, గుడిపాటి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



సభాస్థలం వద్ద రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఆర్ఎంపీల సమస్యలు పరిష్కరించాలని వినతి

తిరుమలగిరి (తుంగతుర్తి) : గ్రామీణ వైద్యులుగా శిక్షణ పూర్తిచేసుకున్న వారిని ప్రభుత్వం గుర్తించాలని జిల్లా ఆర్ఎంపీ, బీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం తిరుమలగిరికి వచ్చిన రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి లక్ష్మణ్‌కుమార్‌లకు వినతి పత్రం అందజేశారు. వారిలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుప్పాల లక్ష్మీనర్సయ్య, కోశాధికారి లక్ష్మణ్‌గౌడ్, అధికార ప్రతినిధి వెంకన్న, జోనల్ ఇన్‌చార్జ్ రామచంద్రన్‌గౌడ్, వెంకన్న, నాగరాజు, శేఖర్, వెంకటేశ్వర్లు, రవి, లక్ష్మి, మహేందర్ ఉన్నారు.

క్యాంపస్ సమాచారం

డిగ్రీ విద్యలో నాణ్యతా ప్రమాణాలు పెరగాలి

- ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్



మాట్లాడుతున్న వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టూటౌన్: డిగ్రీ విద్యలో నాణ్యతా ప్రమాణాలు పెరగాలని నల్లగొండ ఎంజీ యూనివర్సిటీ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం యూనివర్సిటీ ఆడిట్‌సెల్ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు, సిలబస్, వంటి అంశాలపై చర్చించారు. 20శాతం కన్నా తక్కువ అడ్మిషన్లు ఉన్న కోర్సులను వేరే విద్యాలయాలకు బదిలీ చేయాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రతి డిగ్రీ కళాశాల ఒక గ్రామాన్ని దత్తత చేసుకొని సామాజిక అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతి కళాశాలలో విద్యార్థులకు 75 శాతం హాజరును తప్పనిసరి చేస్తూ బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయాలన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ అల్వాల రవి, ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రశాంతి, డిప్యూటీ డైరెక్టర్ జయంతి, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ఎంఎస్సీ జియాలజీలో ప్రవేశాలకు ఆహ్వానం

నల్లగొండ టూటౌన్: నల్లగొండలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీలో సీపీజీఈటీ- 2025 ద్వారా ఎంఎస్సీ జియాలజీలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. బీఎస్సీ జియాలజీ, బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, మైక్రో బయాలజీ, బయో కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో ఏదో ఒక సబ్జెక్టులో డిగ్రీ ఉత్తీర్ణత కలిగి ఉండాలి. కోర్సులో చేరడానికి సీపీజీఈటీ 2025 ద్వారా ఈ నెల 17లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

జియాలజీతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

2011లో ఎంజీ యూనివర్సిటీలో జియాలజీ విభాగం 20 సీట్లతో ప్రారంభం కాగా.. ప్రస్తుతం 40 సీట్లు ఉన్నాయి. ఆధునిక ల్యాబ్స్, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఆధునిక ప్రయోగశాలలు, డిజిటల్ తరగతులు, ప్రతి సెమిస్టర్‌లో ఫీల్డ్ ట్రైనింగ్, జాతీయ స్థాయి సంస్థలతో ఎంఓల అనుసంధానం, ప్లేస్‌మెంట్ సౌకర్యాలు ఉన్నాయి. ప్రాక్టికల్ నిర్వహణతో విద్యార్థుల్లో అనుభవ సామర్థ్యం పెంచడం జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వ రంగంలోని జీఎస్ఐ, ఎన్ఆర్ఎస్, ఓఎన్‌జీసీ, ఐబీఎం, ఎన్ఎండీసీ, ఐఎస్ఆర్ఓ, ఎన్ఆర్ఎస్ఈ, ఆయిల్ ఇండియా లిమిటెడ్ తదితర రంగాల్లో అవకాశాలు లభిస్తాయని యూనివర్సిటీ అధ్యాపక బృందం పేర్కొంటుంది. జియాలజీ కోర్సు పూర్తి చేసి సంబంధిత ఉద్యోగం పొందిన వారికి వార్షిక వేతనం రూ.3.5 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు, ప్రభుత్వ రంగంలో నెలకు రూ.40 వేల నుంచి రూ.2 లక్షల వరకు వేతనం లభిస్తుంది. ఎంజీయూలోని ఎంఎస్సీ జియాలజీ పూర్తి చేసిన వందలాది మంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలు దక్కాయి.

బీసీ, ఎస్టీలకు కేబినెట్‌లో చోటు కల్పించాలి

- మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు



మాట్లాడుతున్న మోత్కుపల్లి నర్సింహులు

యాదగిరిగుట్ట: రాష్ట్రంలో ఇటీవల కేబినెట్ విస్తరణలో భాగంగా బీసీ, మాల, మాదిగలకు మంత్రులుగా చోటు కల్పించడం సంతోషకరమని, ఖాళీగా ఉన్న మరో మూడింటిని కూడా బీసీ, ఎస్టీలకు అవకాశం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతున్నట్లు మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు తెలిపారు. శుక్రవారం యాదగిరిగుట్ట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి పదవి కేటాయింపులో కాంగ్రెస్ అధిష్టానం పూర్తి అధికారం సీఎం రేవంత్‌రెడ్డికి ఇస్తే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. సామాజిక న్యాయం జరగాలంటే చిన్న వర్గాల వారికి పదవులు ఇవ్వాలన్నారు. తన జన్మదినోత్సవం సందర్భంగా యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు బీర్ల శంకర్, బందారపు భిక్షపతి, ఎరుకల హేమేందర్‌గౌడ్, శ్రీరాంమూర్తి, దడిగె ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్ల ఘనత కాంగ్రెస్‌దే

- కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ సంపత్‌కుమార్



సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ సంపత్‌కుమార్, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

భువనగిరిటౌన్ : స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, కార్యకర్తలు ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ సంపత్‌కుమార్, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం భువనగిరిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలకు రాజకీయంగా రిజర్వేషన్లు కల్పించడంలో అన్ని పార్టీలు మోసం చేశాయని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాటకు కట్టుబడి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాలను కైవసం చేసుకునేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. అంతకుముందు జిల్లా కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభించారు.

లారీ ఢీకొని ఒకరికి గాయాలు

అర్వపల్లి : అర్వపల్లిలో మెయిన్‌రోడ్డుపై శుక్రవారం రెండు కార్లు ఢీకొని ఒకరు గాయపడ్డారు. సూర్యాపేట వైపు నుంచి జనగామ వైపునకు కారు వెళ్తుండగా.. నకిరేకల్ వైపు నుంచి తిరుమలగిరి వైపు వెళ్లే మరోకారు రెండు ఢీకొన్నాయి. ఈ సమయంలోనే అయిటిపాములకు చెందిన శేఖర్ రోడ్డు దాటుతుండగా కారు అతడిని ఢీకొట్టింది. దీంతో శేఖర్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం సూర్యాపేట జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు.

ఆవిష్కరణల వేగవంతానికి ఇంపాక్ట్ హ్యాకథాన్ దోహదం

బీబీనగర్: ఫ్రంట్‌లైన్ హెల్త్‌కేర్‌తో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనుసంధానించే ప్రయత్నంలో భాగంగా ఐఐఐటీ హైదరాబాద్, బీబీనగర్ ఎయిమ్స్ సంయుక్తంగా మెడ్‌కేర్ ఏఐ ఇంపాక్ట్ హ్యాకథాన్ కార్యక్రమాన్ని శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా ఎయిమ్స్ డైరెక్టర్ అహంతెమ్ శాంతాసింగ్ మాట్లాడుతూ.. డీప్‌టెక్ ఆవిష్కరణలు వేగవంతం చేయడానికి హ్యాకథాన్ దోహదపడుతుందని తెలిపారు. ఆరోగ్య సంరక్షణ, వాటి పరిష్కారం, ఏఐ అధికారిత క్లినికల్ సాధనాలను అభివృద్ధి చేసేందుకు ఉపయోగపడతుందని పేర్కొన్నారు. ఆరోగ్య సంరక్షణ పరిష్కారాలను అందించడంలో ప్రధానపాత్ర పోషిస్తుందని తెలిపారు. ఏఐ ఆధారిత చెక్‌లిస్ట్‌పై ఆవిష్కరణలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

లారీని ఢీకొట్టిన డీసీఎం..

- డ్రైవర్‌కు తీవ్రగాయాలు

నకిరేకల్: నకిరేకల్ శివారులో శుక్రవారం లారీని డీసీఎం ఢీకొట్టడంతో డీసీఎం డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా (ఎస్)రాయవరం మండలం పెనుగోలుకు చెందిన డీసీఎం డ్రైవర్ అప్పల రాజు డీసీఎంలో హైదరాబాద్ నుంచి వైజాగ్‌కు మెడిసిన్ లోడ్‌తో వెళ్తున్నాడు. మార్గమధ్యంలో నకిరేకల్ శివారులోని బైపాస్‌లోని తాటికల్ ఫ్లైఓవర్ వంతెన సమీపంలో ముందు వెళ్తున్న లారీ ఎలాంటి సిగ్నల్స్ వేయకుండా సడన్ బ్రేక్ వేశాడు. ఈ లారీని వెనుక నుంచి డీసీఎం ఢీకొట్టింది. ఈప్రమాదంలో డీసీఎం ముందు భాగం నుజ్జునుజ్జయింది. డ్రైవర్ సీటులో ఉన్న అప్పల రాజు రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న నకిరేకల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వాహనంలో ఇరుక్కుపోయిన అప్పలరాజును బయటకు తీశారు. అతడిని నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స నిమిత్తం వైజాగ్‌లోని ఆస్పత్రికి తరలించారు. పెనుగోలు గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు.

ఒంటరి మహిళలే టార్గెట్

- పుస్తెలతాడు చోరీ చేస్తున్న ఇద్దరు అన్నదమ్ముల అరెస్టు
- రూ.19 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ: ఒంటరి మహిళలను టార్గెట్ చేసుకుని వారి మెడలో బంగారు ఆభరణాలు చోరీ చేస్తున్న ఇద్దరు అన్నదమ్ములను పోలీసులు అరెస్టు చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడించారు. త్రిపురారం మండలం నీలాయిగూడెం గ్రామానికి చెందిన రావిరాల పవన్ లిఫ్ట్ టెక్నీషియన్‌గా చేస్తున్నాడు. ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలో ఉంటున్నాడు. అతడి సోదరుడు రావిరాల రాజు డ్రైవర్‌గా చేస్తున్నాడు. అతను హైదరాబాద్‌లోని సంగీ టెంపుల్ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. వీరిద్దరూ సులభంగా డబ్బు సంపాదించేందుకు ఒంటరి మహిళలనే టార్గెట్ చేసుకుని బంగారు ఆభరణాల చోరీకి పాల్పడుతున్నారు. ఈ నెల 4న చండూరు మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన బాధితురాలు బుచ్చమ్మ మధ్యాహ్నం 2 గంటల సమయంలో తన వ్యవసాయ భూమి నుంచి ఇంటికి వస్తుండగా నిందితులిద్దరూ ఆమె దగ్గరకు వెళ్లి ఇడికుడకు దారి ఎటు అని అడుగుతూ మాటల్లో పెట్టి బాధితురాలి మెడలో ఉన్న 3 తులాల పుస్తెల తాడు లాక్కుని పరారయ్యారు. ఈ విషయమై బాధితురాలు చండూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ శివరాంరెడ్డి పర్యవేక్షణలో చండూరు సీఐ ఆదిరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ వెంకన్న, కనగల్ ఎస్ఐ విష్ణుమూర్తి నాలుగు టీంగా ఏర్పడ్డారు. కేసు దర్యాప్తులో భాగంగా శుక్రవారం ఉదయం 7.30కు తాస్కానిగూడెం శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న వారిని పట్టుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. వీరిద్దరూ కుటుంబ ఆర్థిక ఇబ్బందుల వల్ల బంగారు ఆభరణాలు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తేలింది. గొల్లగూడెంలో, వాడపల్లి మండలం కల్లేపల్లి సమీపంలో, పెన్‌పహాడ్‌లోని అనాజీపురం లింగాల, దోసపాడు గ్రామాల సమీపంలో, వేములపల్లి మండలం బీరెల్లిగూడెం సమీపంలో, నకిరేకల్ మండలం చందుపట్లలో, మద్రూర్‌లో రావిరాల పవన్, రావిరాల రాజు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. వారి నుంచి 19.5 తులాల 8 బంగారు పుస్తెల తాళ్లు, 2 సెల్‌ఫోన్లు, దొంగతనం చేయడానికి ఉపయోగించిన నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదించిన డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ కె. ఆదిరెడ్డి, చండూరు, కనగల్ ఎస్ఐలు వెంకన్న, విష్ణుమూర్తి, ఉపేంద్ర, కార్తీక్, అరుణ్, నగేష్‌ను ఎస్పీ అభినందించారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న ఆరు టిప్పర్లు సీజ్

చివ్వెంల(సూర్యాపేట) : అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటన చివ్వెంల మండల పరిధిలోని మోదిన్‌పురం గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోదిన్‌పురం గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కాలువ వెంట ఉన్న మట్టిని అక్రమంగా సూర్యాపేటకు చెందిన వ్యాపారులు నల్లకుంట్ల సత్యం, గుండాల సురేష్, జోగ్ నవీన్, ఆరె లింగస్వామి, జల లింగరాజు, ఆరె సైదులు, ఎల్లుట్ల లింగస్వామి జేసీబీ సాయంతో టిప్పర్లలో మట్టిని నింపి సూర్యాపేటకు తరలిస్తున్నారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని టిప్పర్లను అదుపులోకి తీసుకుని డ్రైవర్లపై కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో ఇద్దరి మధ్య ఘర్షణ

- బీరు సీసాతో దాడి చేయడంతో ఒకరికి గాయాలు

గరిడేపల్లి: మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు ఘర్షణ పడ్డారు. ఓ వ్యక్తి మరో వ్యక్తిపై బీరు సీసాతో దాడి చేయగా ఒకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం రాత్రి గరిడేపల్లి మండలంలోని పొనుగోడు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై చలికంటి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పొనుగోడు గ్రామానికి చెందిన షేక్ ఫకీరా, శ్రీపాద సాయిచరణ్ కొంత మందితో కలిసి మద్యం సేవించారు. ఈ సమయంలో షేక్ ఫకీరా, సాయిచరణ్ మధ్య వివాదం తలెత్తింది. ఇదే సమయంలో పక్కనే ఉన్న ఫకీరా అన్న కొడుకు షేక్ అజీజ్ పాషా తన బాబాయిని ఎందుకు దూషిస్తున్నావని అడగగా వెంటనే సాయిచరణ్ తన చేతిలోని బీరు బాటిల్‌ను పగలగొట్టి అజీజ్ పాషాపై దాడి చేశాడు. దీంతో అజీజ్ పాషా ఛాతికి గాయాలయ్యాయి. గమనించిన స్నేహితులు అతడిని హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు, జరిమానా

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు శుక్రవారం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు డ్రైవింగ్ చేస్తూ ఆరుగురు పట్టుబడ్డారు. వారిని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా సూర్యాపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బీవీ.రమణ ఒకరికి ఒక రోజు జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా, మిగతా ఐదుగురికి కలిపి రూ.7వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం తెలిపారు.

వృద్ధురాలి మెడలో పుస్తెలతాడు చోరీ

భువనగిరిటౌన్ : భువనగిరి పట్టణంలో శుక్రవారం వృద్ధురాలు మెడలోని పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక పోచమ్మవాడకు చెందిన వృద్ధురాలు పోతంశెట్టి శారద బస్తీ దవాఖానకు వెళ్లి ఇంటికి వెళ్తోంది. ఈక్రమంలో గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి ఆమె మెడలోని రూ.4 లక్షల విలువైన బంగారు పుస్తెలతాడును లాక్కొని పరారయ్యాడు. ఆమె కింద పడడంతో తలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అప్రమత్తమై నిందితుడి కోసం వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చి ఆమెను ఆస్పత్రికి తీసుకువెళ్లారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మీనారాయణ తెలిపారు. సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

ద్రవరూప ఎరువులతో రైతులకు ప్రయోజనం

- ఎరువుల ఖర్చులను తగ్గించేందుకు ద్రవరూప యూరియా తీసుకువచ్చిన కేంద్రం



నానో డీఏపీ డబ్బాలు, నానో యూరియా


పెద్దవూర: వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రైతులకు ఆర్థిక ఇబ్బందులను తగ్గించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఎరువుల ఖర్చులను తగ్గించే ప్రయత్నం చేస్తోంది. గతంలో పంటలకు వేసే డీఏపీ, యూరియా గుళికల రూపంలో ఉండేది. ఒక్కోటి 50 కిలోల బస్తా మార్కెట్లో అందుబాటులో ఉండేది. ఏళ్ల తరబడి కొన్ని రకాలైన పంటలకు రసాయన ఎరువులను అధిక మోతాదులో వినియోగిస్తున్నారు. అధికంగా రసాయన ఎరువుల వాడకం మంచిది కాదని తెలిసినా గత్యంతరం లేక రైతులు వీటిని వినియోగిస్తున్నారు. రైతుల ఆరోగ్యానికి సైతం పెద్దముప్పుగా మారిందని భావించిన కేంద్ర ప్రభుత్వం ద్రవరూప యూరియా, డీఏపీలను తీసుకువచ్చింది. దీంతో భూమిలో సారం కోల్పోయి క్రమేణ పంట దిగుబడులు తగ్గుతున్నాయి. మూడేళ్ల క్రితమే నానో యూరియా మార్కెట్లోకి రాగా గత యేడాది నుంచి ద్రవ రూపంలో ఉండే డీఏపీ సైతం అందుబాటులోకి వచ్చింది. ఘనరూపంలో ఉండే 50 కిలోల డీఏపీ బస్తా రూ.1350లు, యూరియా బస్తా రూ.266లు ధర మార్కెట్‌లో ఉంది. కాగా ఇఫ్కో కంపెనీ మార్కెట్‌లోకి ప్రవేశపెట్టిన నానో డీఏపీ అర లీటరుకు రూ.600లు, యూరియా అర లీటర్‌కు రూ.240 ధరతో మార్కెట్‌లో అందుబాటులో ఉంది. ద్రవరూప యూరియాపై రూ.26(266-240), డీఏపీపై రూ.750(1350-600) వరకు రైతులకు ప్రయోజనం చేకూరుతుంది.

పాడిపంట

పోషక విలువలు పెరుగుదల

అధికారుల అంచనా ప్రకారం ద్రవరూప ఎరువులతో పంటకు ప్రయోజనం సుమారు 90శాతం ఉంటుందని తెలుపుతున్నారు. అరలీటరు నానో డీఏపీ, యూరియా డబ్బాలు 50 కిలోల బస్తాతో సమానం. ఎకరానికి అర లీటరు నానో డీఏపీ సరిపోతుంది. వరి నాటు వేసేటప్పుడు ఘనరూప డీఏపీ ఎంత విస్తీర్ణంలో వినియోగిస్తామో, అరలీటర్ ద్రవరూప డీఏపీ పొలంలో పిచికారీ చేస్తే సరిపోతుంది. ద్రవరూపంలో పిచికారీ చేయడం వలన అదనంగా పోషకాలు సైతం ఉండటంతో మొక్కలు నత్రజని అవసరాన్ని సమర్థవంతంగా తీరుస్తుంది. దీంతో ఆకులలో కిరణజన్య సంయోగక్రియ పెరుగుతుంది. మొక్క వేర్లలో కణజాలం వృద్ధిచెంది, పంట ఉత్పత్తిలో పోషక విలువలు పెంచుతుంది. డీఏపీ, యూరియాల బస్తాలకంటే ద్రవరూప ఎరువుల్లో పోషకాలు అధికంగా ఉంటాయి. ఘనరూపంలో ఉండే ఎరువుల వినియోగంతో చాలా వరకు మొక్కకు అందకుండా వృథా అవుతుంది. ద్రవరూప ఎరువులు నేరుగా మొక్కపై పిచికారీ చేయడంతో వృథా ఉండదు.

నానో ఎరువులు మేలైనవి



ద్రవరూప యూరియా, డీఏపీల ఉపయోగంపై రైతులకు ఎలాంటి అనుమానం అవసరం లేదు. గుళికల ఎరువు కంటే నానో ఎరువులు చాలా మేలైనవి. వరి నాటుకు ముందుగా ఒకసారి మాత్రమే నానో డీఏపీని పొలంలో పిచికారీ చేయాలి. అలాగే నానో యూరియాను లీటర్ నీటికి 2మి.లీ. లేదా 4మి.లీ. చొప్పున కలిపి మొదటగా పంట పెరుగుదల దశలో తర్వాత నెలలోపు పూత దశలో రెండోసారి పిచికారీ చేయాలి. దీంతో రైతులకు సుమారు 8 శాతం పంట దిగుబడి పెరుగుతుంది.

– పి.సందీప్‌కుమార్, ఏఓ, పెద్దవూర